
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 36.5
కనిష్ఠం 25.0
ANDHRAJYOTHY
నల్లగొండ
7
గురువారం 13 జూన్ 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి నీటి మట్టం (అడుగులు)	ప్రస్తుత	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.70 (122.8483)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.30 (2.57)	321	84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	100 (0.76)	నిల్	నిల్

మోగిన బడి గంట

● పాఠశాల బాట పట్టిన విద్యార్థులు



నల్లగొండలో మొదటిరోజు పాఠశాలకు వెళుతున్న చిన్నారులు

నల్లగొండ, జూన్ 12: దాదాపు 40రోజుల పాటు వేసవి సెలవుల్లో ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు బుధవారం నుంచి పాఠశాల పునఃప్రారంభం కావడంతో బడి బాటపట్టారు. ఇప్పటికే విద్యాశాఖ విద్యార్థుల కు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను, యునిఫాంలను అందుబాటులో ఉంచిన సంగతి తెలిసిందే. ఒక వైపు పాఠశాల పునఃప్రారంభం కాగా, మరో వైపు జిల్లా విద్యాశాఖ పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో నిమగ్నమైంది. ఉపాధ్యాయులకు ఎక్కడికి బదిలీ అవుతుందో అన్న ఆలోచనతో ఉండటంతోపాటు మరో వైపు పాఠశాలలను ప్రారంభించేందుకు వెళ్లారు. చాలా చోట్ల పాఠశాలలను శుభ్రంగా ఉంచడం కోసం స్కావెంజర్లు లేక పోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడినట్లు సమాచారం. బుధవారం మంచి రోజు కాకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించలేదని తెలుస్తోంది. తొలిరోజు పాఠశాలలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్నట్లు వినికిడి. ఇక పోతే ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన బస్సుల తనిఖీని ఆర్టీవో అధికారులు ముమ్మరంచేశారు. నల్లగొండ ఆర్టీవో లావణ్య ఆధ్వర్యంలో విస్తృతంగా బస్సులను పరిశీలించారు. అయితే మొదటి రోజు బస్సుల ఫిట్‌నెస్‌కు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు కానట్లు సమాచారం.

రహదారులపై స్కూల్ బస్సులు, ఆటోల సందడి

పాఠశాలలు తెరుచుకోవడంతో రహదారులపై స్కూల్ బస్సులు, ఆటోల సందడి ప్రారంభమైంది. తొలిరోజున విద్యార్థులు ప్రయాణిస్తూ చేసిన సందడితో కోలాహలం నెలకొన్నది. పిల్లలను వాహనాల్లో ఎక్కిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులు చెబుతున్న తీరు చూడ ముచ్చటగా అనిపించింది. అలాగే బైకులు, కార్లు తదితర సొంత వాహనాల్లో పిల్లలను పాఠశాలల వద్ద దిగబెడుతూ తల్లిదండ్రులు హడావుడి చేశారు.



పశువైద్యం.. దయనీయం

ఆంధ్రజ్యోతి విజిట్

జిల్లాలో పశువైద్యం పరిస్థితి దయనీయంగా మారింది. మూగజీవాలకు రోగాలొస్తే సకాలంలో వైద్యమందే పరిస్థితి లేకుండాపోయింది. ప్రధానంగా వైద్యులు, సిబ్బంది నియామకాల్లేకపోవడంతో అరకొర డాక్టర్లు, సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. అత్యవసర మందులు అందుబాటులో లేక, ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. రైతులకు సీజనల్‌గా అందించాల్సిన గడ్డి విత్తనాలు, మూగజీవాలకు వేయాల్సిన నట్టల నివారణ మందులు లేక నానా యాతన పడుతున్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)



చండూరులో ఖాళీగా పశువైద్యాధికారి కుర్చీ



పీఏపల్లిలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

» వేధిస్తోన్న వైద్యులు, సిబ్బంది కొరత » 317 జీవోతో దాదాపు ఖాళీ అయిన వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు » మందులకొరత కూడా ఉండడంతో ప్రైవేట్‌ని ఆశ్రయిస్తోన్న సిబ్బంది » కొత్త ప్రభుత్వమైనా స్పందించి పశువైద్యాన్ని గాడిలో పెట్టాలనే సూచనలు » ఆంధ్రజ్యోతి పరిశీలనలో పలులోపాలు వెలుగులోకి

నల్లగొండ జిల్లాలో మొత్తం అయిదు వెటర్నరీ ఆసుపత్రులు, 54 ప్రాథమిక వెటర్నరీ సెంటర్లు, మరో 57 సబ్‌సెంటర్లున్నాయి. వీటిలో పనిచేసేందుకుగాను అయిదు అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు, 54 వెటర్నరీ డాక్టర్ పోస్టులు, 57 వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు, 126వరకు అటెండర్ పోస్టులున్నాయి. అయితే అయిదుగురు ఏడీ పోస్టులకు రెండు ఖాళీలుంటే, వెటర్నరీ డాక్టర్ల పోస్టులు 10 ఖాళీలు, కీలకంగా క్షేత్రస్థాయిలో పనిచేసే వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు అత్యధికంగా 40 ఖాళీలుంటే, 70 అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో జిల్లాలో పశువైద్యం దైవాదీనంగా మారింది. ఉన్న డాక్టర్లు, సిబ్బందికే అదనపు బాధ్యతలిస్తుండడంతో వారు ఎక్కడా సక్రమంగా పనిచేయలేని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో వివిధ కేంద్రాల్లో 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో పరిస్థితి ఇదీ..

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలో మండల కేంద్రం మినహా పక్కా ప్రభుత్వ భవనాలతో ఉన్న జూనూతుల, పిట్టలగూడెం, చేపూరు గ్రామాల్లోని పశువైద్యశాలలు మూతపడ్డాయి. కొప్పోలులో ఉన్న సబ్‌సెంటర్‌లో ఉన్న ఒక్క అటెండర్ అనారోగ్యం బారినపడడంతో అరకొర సేవలే అందుతున్నాయి. మండల కేంద్రంలోని ఆసుపత్రిలోనూ పశువైద్యాధికారికి ఒకేఒక్క సహాయకుడుండడంతో పూర్తిగా సేవలందించలేకపోతున్నారు. ఇక్కడ వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

చండూరు: మండలంలో.. సిబ్బంది కొరతతో పూర్తి స్థాయిలో చికిత్స అందించడం లేదు. కేవలం నట్టల నివారణ మందులు మినహా ఇతర మందులు అందుబాటులో లేవని రైతులు వాపోతున్నారు. 20ఏళ్ల క్రితం చండూరు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి ఓ ప్రత్యేక గదిని అప్పట్లో కేటాయించారు. నాటినుంచి నేటి వరకు పశు వైద్యశాలకు ప్రత్యేక భవనం లేకుండా పోయింది. పుల్లెంల, తేరట్‌పల్లి, గట్టుప్పల గ్రామాల్లో సబ్‌సెంటర్లను ఏర్పాటుచేశారు. కానీ అందులో సిబ్బంది సరిపడా లేరు.

నార్కట్‌పల్లిలో: మండలంలోని అమ్మనబోలు, నార్కట్‌పల్లిలో రెండు పశు వైద్యశాలలు ఉన్నాయి. కొత్తగా బీ.వెల్లెంల, అక్కెనపల్లి, ఎల్లారెడ్డిగూడెంలలో పశువైద్య కేంద్రాలు మంజూరు చేయాలని రైతుల నుంచి చాలా కాలంగా విజ్ఞప్తులందుతున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు.

తిప్పర్తి: ఏడాది కాలంగా తిప్పర్తి పశువైద్యశాలలో మందుల కొరత నెలకొంది. సీజనల్‌గా వస్తున్న గాలికుంటు వ్యాధికి సంబంధించిన టీకాలు మినహా రోజువారీగా వైద్యశాలకు అవసరమయ్యే మందులు ఏవి కూడా లభించడం లేవు. గతంలో ప్రతీ మూడు నెలకోసారి ఏదో ఒక రోజు కచ్చితంగా మందులు సరఫరా అయ్యేవని, గత ఏడాది కాలంగా సరఫరా అవడం లేదని వైద్యులు చెబుతున్నారు.

చండూరు: మండలకేంద్రంతోపాటు పుల్లెంలలో మరో వైద్యశాల ఉంది. ఇక్కడ వసతులు లేవు, వైద్యం అరకొరగా సాగుతుంది. డాక్టర్లు సమయపాలన పాటించకపోవడంతో డాక్టర్లు లేని సమయంలో అత్యవసరమైతే అటెండరే వైద్యుడై చికిత్స చేసి పంపిస్తారు. రెండేళ్లుగా ఎలాంటి గడ్డివిత్తనాలు అందడం లేదు.

చిట్యాల/చిట్యాల రూరల్: చిట్యాలలోని పశువుల ఆసుపత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించకపోగా, రైతులు ప్రశ్నిస్తే సిబ్బంది దురుసుగా సమాధానమిస్తున్నారు. ఎలాంటి మందులు లేవని, ఈ ఏడాది ప్రభుత్వం నుంచి సరఫరా లేవని సిబ్బంది పేర్కొంటున్నారు. సబ్‌సెంటర్లలో సిబ్బంది కొరతకు తోడు మందుల కొరత ఉంది.

కేతేపల్లిలో: మండలంలోని సబ్‌సెంటర్లు, పశువైద్యశాలల్లో నెలనెలా సరిపడా మందులు, సిబ్బంది లేరన్న విమర్శలున్నాయి. కేతేపల్లిలో మాత్రమే పూర్తి స్థాయిలో పోస్టులు భర్తీ చేసి ఉన్నాయి. కొప్పోలులో డాక్టర్, అటెండర్

మిర్యాలగూడరూరల్‌లో: మండలంలోని ఉట్లపల్లిలోని లైవ్ స్టాక్ అసిస్టెంట్ జీవో నెం.317 ప్రకారం బదిలీపై వెళ్లడంతో అడిషనల్ చార్జ్‌తో సేవలు అందిస్తున్నారు.

● **మునుగోడు..** మండలంలో కొంపల్లి పశువైద్య శాలలో కంపౌండర్, వెల్మకన్నెలో అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొంపల్లి పరిధిలోని కొందరు వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చూపుతూ డుమ్మా కొడుతున్నారని ఆరోపణలున్నాయి.

● **మర్రిగూడ..** మండలంలోని మర్రిగూడ, శివన్నగూడ, కొండూరు గ్రామాల్లో మూడు పశువైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది లేక మూగ జీవాలకు సరైన వైద్య అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **నిడమనూరు..** మండలంలో నాలుగు పశు వైద్యశాలలున్నా మూగజీవాలకు మాత్రం అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయి. నిడమనూరులో సహాయ సంచాలకులు, వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఐదేళ్లుగా ఖాళీ ఉంది.

● **నకిరేకల్..** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో సొంత భవనంలేక పశువైద్యశాలని స్త్రీశక్తి భవనంలో అరకొర వసతులతో నిర్వహిస్తున్నారు. నకిరేకల్ మండలంలోని నకిరేకల్, చందుపట్ల, మంగళపల్లి, ఓగోడు, నోముల గ్రామాలలో పశువైద్యశాల కేంద్రాల్లో చందుపట్ల, నోముల, ఓగోడు కేంద్రాల్లో ఎల్ఎస్ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మాత్రమే ఉండగా పారాస్టాఫ్ పోస్టు ఖాళీగా ఉంది.

శాలిగౌరారంలో: మండలంలోని రామగిరిలోని పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఆఫీస్ సబార్డినేట్ ఉన్నారు. ఇక్కడ జేవీవో పోస్టు సంవత్సరాలు తరబడి ఖాళీగా ఉంది. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిత్తలూరు పశువైద్య సబ్ సెంటర్‌లో సిబ్బందిలేక ఆరేళ్లుగా మూతపడి ఉంది.

● **కట్టంగూరు..** మండలంలో కొన్ని పశువైద్యశాలలు సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. అయిటిపాముల సబ్‌సెంటర్‌లో సిబ్బంది లేకపోవడంతో రెండేళ్లుగా మూతపడింది. అయిటిపాముల సబ్‌సెంటర్‌లో గతంలో ఎల్ఎస్ఏ పోస్టు ఉండగా, గత ప్రభుత్వం తెచ్చిన జీవో 317తో ఆ పోస్టు కూడా ఖాళీ అయింది.

● **తిరుమలగిరి(సాగర్)లో..** మండలంలోని రాజవరంలో నిర్మించిన సబ్ సెంటర్ శిథిలావస్థకు చేరి అరకొర వసతుల మధ్య మూగజీవాలకు చికిత్స అందిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాలోని నకిరేకల్, చండూరు పశువైద్యశాలలతో పాటు, మరోమూడు వెటర్నరీ ప్రాథమిక ఆసుపత్రులకు భవనాల నిర్మాణాలకోసం ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నిర్మాణాలు చేపడతాం. జిల్లాలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని, అందుబాటులో ఉన్నవారితో వీలైనంతమేర సేవలందిస్తున్నామని, మందుల విషయంలోనూ ప్రభుత్వం నుంచి వచ్చిన సరఫరా మేరకు రైతులుకు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు.
- శ్రీనివాస్‌రావు, జిల్లా పశుసంవర్థకశాఖ జాయింట్ డెరెక్టర్

సిబ్బంది లేరు.. మందుల్లేవు

దేవరకొండలో: దేవరకొండ పశువైద్యశాలతోపాటు సబ్‌సెంటర్‌లలో డాక్టర్లు, సిబ్బందితోపాటు మందుల కొరత తీవ్రంగా ఉంది. దేవరకొండ పశువైద్యశాలలో మందుల కొరత తీవ్రంగా ఉంది. నట్టల మందులు, ఇతర మందులు తప్ప అత్యవసర సమయంలో పశువులు, మూగజీవాలకు ఉపయోగపడే మందుల సరఫరాలేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో రైతులు సొంత డబ్బులతో మందులు తెచ్చుకునే దుస్థితి నెలకొంది.

చందంపేటలో: మండలంలో పేరుకే రెండు పశువైద్యశాలలు ఉన్నాయి. చందంపేట, తెల్దేవర్‌పల్లిల్లోని రెండు కేంద్రాలకు కలిపి ఒక వైద్యుడు, ఒక వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగతా పోస్టులన్నీ ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో మండలంలోని పశువులు, గొర్రెలకు ఆశించినరీతిలో వైద్యసేవలు అందడంలేదు. తెల్దేవరపల్లి పరిధిలోని ఉప కేంద్రంలో సంవత్సరాల తరబడి సిబ్బంది



లేకపోవడంతో మూతపడింది.

డిండి: మండలంలో మూడు పశువైద్యశాలలతోపాటు రెండు సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఇప్పటికే టి.గౌరారం, గోనబోయినపల్లి సబ్‌సెంటర్‌లు వైద్యులులేక మూతపడ్డాయి. తవక్లాపూర్ పశువైద్యశాలలో వైద్యునితోపాటు అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. చెర్కుపల్లి పశువైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకమైన వైద్యుడు వైద్యం అందిస్తుండగా అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. డిండి వైద్యశాలలో కూడ అటెండర్ పోస్టు ఖాళీగాఉంది.

కొండమల్లేపల్లిలో: కొండమల్లేపల్లి, పెండ్లిపాకల గ్రామాల్లో రెండు పశువైద్యశాలలు ఉన్నాయని పెండ్లిపాకల పశువైద్యశాల భవనం కూలిపోవడంతో మూతబడినట్లు పశువైద్యాధికారి నాగయ్య తెలిపారు. మల్లేపల్లి పశువైద్యశాల భవనం పాతపడడంతో వర్షం వస్తే మొత్తం కురుస్తుందని, ఆఫీసులో ఉన్న రికార్డులు తడుస్తున్నట్లు, వర్షం కురిసినప్పుడల్లా షార్ట్ సర్క్యూట్ అవుతుందని, ఆస్పత్రి భవనం మొత్తం విద్యుత్ సరఫరా అవుతోంది.

పెద్దఅడిశర్లపల్లిలో: ఉమ్మడి మండలంలో పీఏపల్లి, మేడారం వైద్యశాలలు కాగా, గుడిపల్లి, ఘనపురం, అజ్మాపురం, వద్దిపట్ల సబ్‌సెంటర్లు ఉన్నాయి. గతంతో ఇద్దరు పశువైద్యులు ఉండేవారు. కానీ రెండేళ్ల క్రితం పీఏపల్లి పశువైద్యధికారి మృతి చెందడంతో మేడారం పశువైద్యధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టరే పీఏపల్లి ఇన్‌చార్జీ వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆసుపత్రుల్లోనూ సిబ్బంది కొరత వేధిస్తోంది. పీఏపల్లి పశువైద్యశాల మొత్తం శిథిలావస్థకు చేరింది.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి

» జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 1,800 పాఠశాలల్లో పనులు » బడిబాట కార్యక్రమంలో విద్యార్థుకు దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేసిన కలెక్టర్



నల్లగొండలో దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ టౌన్, జూన్ 12: బడి ఈడు ఉన్న ప్రతీ చిన్నారి బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జయశంకర్ బడిబాట పేరున పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించుకోవడమే కాకుండా, వారికీ అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలల పునప్రారంభం సందర్భంగా కలెక్టర్ దాసరి చందన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సుమారు 2లక్షల దుస్తులను కుట్టించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 1,800 పాఠశాలల్లో పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొత్త తరగతి గదులను నిర్మించామని, డైనింగ్ హాల్‌కు పెయింటింగ్ పనులు రెండురోజుల్లో పూర్తి చేయనున్నట్లు వివరించారు. విద్యార్థులు మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మునిసిపాలిటీ ద్వారా అవసరమైన నీటి వసతిని కల్పిస్తామని, ఇవేకాకుండా ఇంకేమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించడమే ధ్యేయంగా పనిచేయాలని, కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందన్నారు. ప్రత్యేకించి అమ్మాయిలకు విద్య ఎంతో ముఖ్యమని, ఇంట్లో తల్లి చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందన్నారు. చదువుకోవడం వల్ల ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుందని, అందుకే కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, గతంతో పోలిస్తే ఇప్పుడు పాఠశాలల్లో సౌకర్యాలు ఎంతో మెరుగ్గా ఉన్నాయని, 96శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉన్నప్పటికీ, నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, టాయిలెట్లు, పుస్తకాలు, దుస్తులు, భోజన వసతి ఇలా.. అన్నింటిని కల్పించిందని, ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు సమాజంలో మంచి స్థానాలను పొందారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, ఎంఈవో అరుంధతి, స్థానిక కౌన్సిలర్ రైసా వసూమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం

గుర్రంపోడు: పాఠశాల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్స్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు విజయవంతంగా పంపిణీ చేశామని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు కొప్పోలు జడ్పీ ఉన్నత పాఠశాల, వెంకటాపురం, ఆరెగూడెం గ్రామప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో పాల్గొని ఆయా పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక వసతుల పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అనుభవం, అర్హతగల ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మంజుల, మండల విద్యాధికారి తరి రాము, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నోముల యాదగిరి, అయిటిపాముల యాదగిరి, డీఈఈ శైలజ, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

కబ్జాదారులకు కటకటాలే

» చెరువులన్నింటికీ హద్దులు నిర్ణయిస్తాం » ఆర్డీవో శ్రీనివాసరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

మిర్యాలగూడ, జూన్ 12: ప్రభుత్వ భూములు, చెరువు శిఖాల కబ్జాలకు పాల్పడితే కటకటాలు తప్పవని ఆర్డీవో శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ హరిబాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదిగా వర్షాలు లేకపోవడంవల్ల డివిజన్‌లో అనేక చెరువులు ఎండిపోయాయన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని పలువురు ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. మిర్యాలగూడ మండల పరిధిలోని రుద్రారం చెరువు సుమారు 160 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చెరువులను ధ్వంసం చేయడం వల్ల భవిష్యత్‌లో గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడుతుందన్నారు. చెరువులను రక్షించుకోపోతే భవిష్యత్ సమాజం మనల్ని క్షమించదన్నారు. శ్రీనివాస్‌నగర్ చెరువు సర్వే పూర్తయిందన్నారు. పందిర్లపల్లి చెరువు సర్వే కొనసాగుతుందని, జూన్ నెలాఖరులోగా మిగతా చెరువుల సర్వే పూర్తిచేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు. కబ్జాలనుంచి వైదొలగకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు తొమ్మిది గంటలకే సిద్ధంగా ఉంటారన్నారు. ధృవీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించవద్దన్నారు. దళారులను అరికట్టేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా అధికారిని కలవాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో సిటిజన్ చార్టల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్ సెంటర్లు, మీసేవా కేంద్రాల్లో చార్టలలో సూచించిన విధంగా చార్జీలు చెల్లించాలన్నారు. ఎక్కువ వసూలు చేస్తే రశీదు అడగాలని, లేదా వీడియో రూపంలో ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయాల్లో రెవెన్యూ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ప్రజా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో డీఏవో జ్యోతి పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణుల సంబరాలు

జిల్లా కేంద్రంలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న కార్యకర్తలు

ఆంధ్రపదేశ్ రాష్ట్ర సీఎంగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోని దేవరకొండ రోడ్డు, సాగర్ రోడ్డు, గడియారం సెంటర్, ఎన్‌టీఆర్ విగ్రహం, సావర్కర్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచాల కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. అంతుకుముందు పలువురు టీడీపీ నేతలు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు.
- నల్లగొండ

'గృహజ్యోతి' వర్తింపజేయాలి

ఎంపీడీవో కార్యాలయం ఎదుట దరఖాస్తుదారుల నిరసన

కనగల్, జూన్ 12: సాంకేతిక సమస్య, అధికారుల నిర్లక్ష్యంతో తామంతా 'గృహజ్యోతి' పథకానికి అర్హత కోల్పోయామని పలువురు మండల ప్రజలు ఆరోపించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట దరఖాస్తు ఫాంలతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము దరఖాస్తు చేసుకున్నా, పథకం తమకు వర్తింపజేయలేదన్నారు. దరఖాస్తుల డాటా ఎంట్రీలో జరిగిన తప్పుల కారణంగా తమ పేర్లు సైట్‌లో నమోదు కాలేదన్నారు. దరఖాస్తులను డాటా ఎంట్రీ చేయటానికి ప్రైవేటు వ్యక్తులకు పనులను అప్పగించారని, అనంతరం అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తప్పులు దొర్లి వందలాది దరఖాస్తులు ఎంట్రీకి నోచలేదని, దీంతో పథకం తమకు వర్తించలేదన్నారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు

డీసీసీబీ పాలకవర్గం సమావేశం వాయిదా

నల్లగొండ, జూన్ 12 : ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గ సమావేశం వాయిదాపడింది. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని కేంద్ర కార్యాలయంలో చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ కోరం లేకపోవడంతో వాయిదా వేశారు. చైర్మన్‌పై డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 28న అవిశ్వాస నోటీస్‌పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 14మంది డైరెక్టర్లు కర్ణాటక రాష్ట్రానికి క్యాంపునకు తరలివెళ్లారు. పాలకవర్గ సమావేశానికి చైర్మన్‌తో పాటు మరో ముగ్గురు మాత్రమే హాజరవడంతో అధికారులు వాయిదా వేశారు.

అవిశ్వాస సమయంలో డీసీసీబీ సమీక్షలా?

ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో రెండు రోజులుగా చైర్మన్ మీటింగ్‌లు ఏర్పాటుచేయడంపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టిన పలువురు డైరెక్టర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సబ్‌కమిటీలు, బుధవారం ఎంసీ మీటింగ్‌లు ఏవిధంగా ఏర్పాటుచేశారని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయంపై ఫోన్‌లో మాట్లాడుతూ మొత్తం 14మంది డైరెక్టర్లం అవిశ్వాస తీర్మాన నోటీసులపై సంతకాలు పెట్టి డీసీవోకు అందజేసిన అనంతరం చైర్మన్ మహేందర్‌రెడ్డి సమావేశాలు నిర్వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన ఈ సమావేశాలపై కలెక్టర్‌కు, డీసీవోకు, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వైస్ చైర్మన్‌తో పాటు మరో 14మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన సమయంలో కోరం లేదని తెలిసినా సమావేశాన్ని ముందుగానే వాయిదా వేయకుండా కార్యాలయానికి వచ్చి బుధవారం కోరంలేదని వాయిదావేయడం సమంజసం కాదన్నారు. అదేవిధంగా అంతకు ముందు రోజు నిర్వహించిన సమావేశం కూడా చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 12 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవ చేపట్టారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్టలోనూ నిత్యకైంకర్యాలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 28,32,118 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనుమానితుడికి దేహశుద్ధి

భువనగిరి రూరల్, జూన్ 12 : అనుమానాస్పదంగా గ్రామంలో తచ్చాడుతున్న వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం అనాజీపురంలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ వారణాసి సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అయ్యాడపు ఉపేందర్‌రెడ్డి ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న భువనగిరి పట్టణం అర్బన్‌కాలనీకి చెందిన మారోళ్ల మారప్పను గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ విషయమై రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో మారప్పను పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారించగా తాను మద్యం మత్తులో తిరుగుతుండగా కొంతమంది తనను అనుమానించి దాడి చేశారన్నారు. తాను పని కోసమే ఆ గ్రామానికి వెళ్లానని తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. తాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాకు చెందిన వాడినని, 15 ఏళ్ల కిందట భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన విజయలక్ష్మిని ప్రేమవివాహం చేసుకున్నానని తెలిపాడు. ఈ విషయమై భార్య విజయలక్ష్మికి సమాచారం ఇచ్చి ఆమెకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. గతంలో ఇతడిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని రూరల్ ఎస్ఐ తెలిపారు.

రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాడ్గులపల్లి, జూన్ 12: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం-చిప్పర్తి గ్రామాల మధ్య రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్ పక్కన ఉన్న మృతదేహాన్ని సిబ్బంది గుర్తించి సమాచారం అందించారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సాలకమ్మ తెలిపారు. మృతుడి సుమారు 45 ఏళ్లు ఉంటాడని, వ్యక్తి రన్నింగ్ ట్రైన్‌లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లి‌ష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

పనిచేసిన ఇంట్లోనే చోరీ

మిర్యాలగూడ, జూన్ 12 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పని కోసం వచ్చిన కూలీలు ఇంటి యజమాని కళ్లు గప్పి నగదు, నగలు చోరీ చేశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి చోరీకి పాల్పడిన ఇరువురు మహిళలను అరెస్టు చేశారు. బుధవారం మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. స్థానిక రవీంద్రనగర్‌కు చెందిన కంచర్ల ఊర్మిల తన ఇంట్లో ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.85 వేల నగదు చోరీకి గురైనట్లు ఈ నెల 5వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దొంగలు ఇంట్లోకి చొరబడినట్లు ఏఆధారం లభించకపోవడంతో రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ నరేష్‌లు కేసును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విదేశాల నుంచి తన కుమారులు తిరిగి వస్తున్నందున ఇంటికి పెయింటింగ్ వేయించేందుకు బాధితురాలు మే 30వ తేదీన అడ్డా కూలీలను పిలిపించినట్లు గుర్తించారు. విచారణలో స్థానిక హౌజింగ్ బోర్డుకు చెందిన ఇరువురు మహిళా అడ్డా కూలీలు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన నగలు, నగదును స్వాధీనం చేసుకుని బుధవారం ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.


దొంగతనం వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం

గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం మోపే దిశలో వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్ఐ నరేష్‌లు సిబ్బంది సహాయంతో దాడులు చేసి పట్టణంలో పెద్దఎత్తున గుట్కా ప్యాకెట్లను నిల్వచేసిన ఇరువురు వ్యాపారులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. మెయిన్‌బజార్‌కు చెందిన గోపారపు రాజు, సీతారాంపురం ప్రాంతానికి చెందిన ఆకుతోట నర్సింహలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12.52 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుట్కా వ్యాపారుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేస్తారని డీఎస్పీ తెలిపారు. గుట్కా వ్యాపారాలు నిర్వహించే వారు మానుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో వన్ టౌన్ పోలీసులు వెంకటేశ్వర్లు, నాగరాజ పాల్గొన్నారు.

తాటిచెట్లపై పిడుగులు


దామరచర్లలో ఎగిసి పడుతున్న మంటలు

దామరచర్ల / గుర్రంపోడు, జూన్ 12 : నల్లగొండ జిల్లా దామరచర్ల, గుర్రంపోడు మండలాల్లో తాటిచెట్లపై పిడుగులు పడ్డాయి. దామరచర్ల మండల కేంద్రంలోని వీర్లపాలెం రోడ్డులో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి భారీ శబ్ధంతో పొలాల్లోని ఎత్తులో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడడంతో సుమారు 20 నిమిషాల పాటు మంటలు ఎగిసిపడ్డాయి. అదేవిధంగా గుర్రంపోడు మండలకేంద్రంలోని నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి కురిసిన వర్షంలో మండలకేంద్రం శివారులోని శాంతినగర్ వద్ద తాటి చెట్టుపై పిడుగు పడి మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. దీంతో ప్రధానరహదారిపై వెళ్తున్న వాహనదారులతో పాటు గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు తప్పవు

కొండమల్లేపల్లి, జూన్ 12 : నాటుసారా తయారుచేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని నల్లగొండ దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. దేవరకొండ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆంగోతుతండా, మంగ్యతండాలలో ప్రజలకు నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆంగోతుతండాలో నాటుసారా తయారీకి ఉపయోగించే 500 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసంచేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు వీరబాబు, మల్లేశ్, నరసింహ, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి కృష్ణ, నాగరాజు, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కోణంలోనే అవిశ్వాసం

● డీసీసీబీ చైర్మన్ మహేందర్ రెడ్డి



నల్లగొండ, జూన్ 12: తనపై రాజకీయ కోణంలో అవిశ్వాసం ప్రవేశపెట్టడం సమంజసం కాదని, ఈ అవిశ్వాసం వీగిపోవడం ఖాయమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 25 ఏళ్ల వయస్సులోనే వంగపల్లి సింగిల్ విండో సొసైటీ నుంచి 400ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందానన్నారు. ఆరు పర్యాయాలు సొసైటీ చైర్మన్‌గా చేసి డబుల్ హ్యాట్రిక్ కొట్టానన్నారు. దివాళా తీసిన బ్యాంకును డీసీసీబీ చైర్మన్‌గా నాలుగున్నర ఏళ్లలోనే రూ.900కోట్ల నుంచి రూ.2400కోట్ల వరకు తీసుకవచ్చానన్నారు. దీని అంతటికి ప్రస్తుత పాలకవర్గ సభ్యులు, వైస్ చైర్మన్‌తో పాటు అధికారుల సహకారం కారణమన్నారు. మరో ఆరు నెలలోనే డీసీసీబీ రూ3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటుందని, అందుకు తాను శాయశక్తులా కృషి చేస్తానని, డైరెక్టర్లు సహకరించాలని కోరారు.

డైరెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినందుకే అవిశ్వాసం


క్యాంప్ నుంచి వీడియో సందేశంలో డైరెక్టర్లు

ఒంటెద్దు పోకడలతో డైరెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాక అవినీతి, అక్రమాలకు పాల్పడినందునే తాము అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి డైరెక్టర్లతో కలిసి సమావేశంలో మాట్లాడిన వీడియోను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి హుందాతనంతో ఉండకుండా ఎంసీ మీటింగ్‌లు, ఇతర సమావేశాలు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైఖరిని మార్చుకోకపోతే సహించేది లేదన్నారు. ఆత్మగౌరవం కోసం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన డైరెక్టర్లను ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి


విక్రమ్(ఫైల్)

పెన్‌పహాడ్, జూన్ 12 : ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బుధవారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దోసపహాడ్ గ్రామానికి చెందిన కారింగుల రమేష్ ట్రాక్టర్‌పై జంగాలకాలనీకి చెందిన కడవంచి రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్‌లో నిత్యం ఇసుక తరలిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో దోసపహాడ్ మూసీనదిలో ఇసుకను లోడ్ చేసుకొని జంగాలకాలనీలో మూలమలుపు వద్ద ఆడుకుంటున్న పర్వతపు సైదులు-కోటమ్మ దంపతుల కుమారుడు విక్రమ్(10)ను అతివేగంగా ఢీకొట్టాడు. ట్రాక్టర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడ్డ బాలుడిని సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలుడి మృతదేహం సూర్యాపేట జనరల్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు కుటుంబ సభ్యులుతెలిపారు.ఈ ఘటనపై బుధవారం సాయంత్రం వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

బుజ్జాయిలను బడికి పంపుతూ..


నల్లగొండలో షూలేస్ సరిచేస్తూ ఒకరు, స్కూల్ వద్ద దింపుతూ మరొకరు, బాలుడి తలదువ్వుతూ ఇంకొకరు... వాహనాలపై తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



దేవరకొండలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

- ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీఎల్ఆర్, బాలునాయక్, సామేల్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, సామేల్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా బుధవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించి న కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. పాఠశాలలకు పిల్లల ను పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియాల్లో విద్యాబోధన సాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని టీచర్లు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని కోరారు. డిజిటల్ తరగతులు, విశాలమైన తరగతి గదులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన పద్ధతులను రూపొందించి ఉత్తమ ఫలితాలు రాబట్టే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కేతేపల్లి, నకిరేకల్: కేతేపల్లి, నకిరేకల్‌లోని జడ్పీహెచ్ఎస్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఉన్న విద్యా విధానాలను సమూలంగా మార్పులు చేస్తూ విద్యార్థులు ప్రపంచంతో పోటీపడే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎస్ఐ శివతేజ, ఎంఈవో నాగయ్య, హెచ్ఎం నర్సిరెడ్డి పాల్గొన్నారు.



నకిరేకల్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

- నకిరేకల్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, నోట్ బుక్స్‌ను ఎమ్మెల్యే వీరేశం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో నాగయ్య, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్, వేములపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి జడ్పీ హైస్కూల్, వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం జడ్పీ హైస్కూళ్లలో ని ర్వహించిన కార్యక్రమల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. యాద్గార్‌పల్లిలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు, ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంఈవో బాలాజీనాయక్, హెచ్ఎం లావూరి బాలు పాల్గొన్నారు.

వేములపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ పుట్టల సునీతకృపయ్య, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, ఎంపీటీసీ పల్లా వీరయ్య, ఎంఈవో బాలాజీనాయక్, నోడల్ అధికారి లక్ష్మణ్‌నాయక్, హెచ్ఎం సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే బాలు నాయక్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం జడ్పీ ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి పాఠశాలలో తరగతి గదులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో నూతన బిల్డింగ్ నిర్మించి సదుపాయాలు కల్పిస్తామని, మైనార్టీ గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ముని సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు జాన్‌యాదవ్, బిక్కునాయక్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రణీలయాదగిరి, ఎంపీడీవో రేఖల లక్ష్మయ్య, ఎంఈవో మేక నాగయ్య, హెచ్ఎంలు మందుల సైదులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- **తిరుమలగిరి(సాగర్)** మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, హెచ్ఎంలు రాజశేఖర్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **అడవిదేవులపల్లి** మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బైరం విజయలక్ష్మి, ఎంపీడీవో కరుణాకర్‌రావు నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు.
- **నిడమనూరు** మండలంలో గురుకులాలతో కలిపి మొత్తం 52 పాఠశాలలు ప్రారంభమయ్యాయి. బడిబాటలో భాగంగా తుమ్మడం జడ్పీ ఉన్నత పాఠశాల, ఇండ్లకోటయ్యగూడెం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బాలునాయక్, మండల నోడల్ అధికారి లావూరి వెంకన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కొండమ్మ, హెచ్ఎం శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.
- **డిండి**లో ఎమ్మార్సీ భవనంలో హెచ్ఎంలకు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను ఎంపీపీ మాధవరం సునీత అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డానియెల్, ఎంఈవో సామ్యానాయక్, ఎంపీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీ రాధిక పాల్గొన్నారు.
- **చిట్యాల** హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేయడానికి పుస్తకాలు, యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయని హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

- **మర్రిగూడ, నాంపల్లి** మండలాలలోని జడ్పీ హైస్కూళ్లలో మర్రిగూడ ఎంపీపీ గండికోట రాజమణి, నాంపల్లి జడ్పీటీసీ ఏవీరెడ్డిలు విద్యార్థులకు పా ఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యునిఫాంలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో గురువారావు, హెచ్ఎం అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **చండూరు** జడ్పీ హైస్కూల్‌లో మునిసిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న పుస్తకాలు, యూనిపాం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బిక్షం, మేనేజర్ అరుణ, ఆదర్శ పాఠశాల చైర్మన్, టీచర్లు పాల్గొన్నారు.
- **చిట్యాల** మండలంలోని తాళ్లవెళ్లెంల గ్రామంలో ఎంపీటీసీ వడ్డెపల్లి ల క్ష్మయ్య విద్యార్థులకు యూనిఫాం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైదులు, కిరణ్‌కుమార్, ఆంజనేయులు, కాటమయ్య, లింగారెడ్డి, బు చ్చిరాములు, దశరథ, అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- **నల్లగొండ** జిల్లా కేంద్రంలోని పద్మానగర్‌లో ఉన్న ఎంకేవీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో అరుంధతి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను, యునిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కర్నాటి పద్మ, హెచ్ఎం నవ్వ దమనేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.
- **కొండమల్లేపల్లి** జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఎం శ్రీనివాస్ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఈఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వస్కుల సుమలత, సముద్రాల శ్రీనయ్య, కొర్ర లోక్యనాయక్, జగదీష్, జనార్ధన్‌రెడ్డి, అక్కిరెడ్డి, దేవకుమార్, శ్రీపతిరావు, సైదానాయక్, సూర్య, లింగారెడ్డి, సీతారాం, గోవర్ధన్ పాల్గొన్నారు.



పెర్కకొండారంలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్



యాద్గార్‌పల్లిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నల్లగొండలో పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో అరుంధతి

జిల్లాలో టీడీపీ శ్రేణుల సంబరాలు



దేవరకొండలో సంబురాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ టౌన్, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డు, సాగర్ రోడ్డు, గడియారం సెంటర్, ఎన్‌టీఆర్ విగ్రహం, సావర్కర్‌నగర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్వీయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రపంచపటంలోనే ఆంధ్రప్రదేశ్ గుర్తింపు వచ్చే విధంగా అభివృద్ధి జరగనుందన్నారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, నాయకులు ఆకునూరి సత్యనారాయణ, సిద్ధిక్, నాగరాజు, చంద్రశేఖర్, రమేష్, స్వరాజ్, క్రాంతికుమార్, రమణయ్య, మహేశ్వర్, వెంకట్రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయడంతో దేవరకొండలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్, చంద్రబాబు కటౌట్లు ఏర్పాటు చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల మురళి, చింతలవాసు, నీల సుమన్, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్‌నాయక్, శ్రీనివాస్, బ్రహ్మచారి, కండె సత్యం, పురుషోత్తం, రాజశేఖర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు ఊరే రమేష్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.
- చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి మిర్యాలగూడ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, మచ్చ సైదులు, పోగుల సైదులుగౌడ్, అనంతరాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు పంపిణీ చేస్తాం

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



తూర్పుపల్లిలో బొడ్రాయి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 12: నిరుపేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కొండభీమనపల్లి గ్రామానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం డబుల్ బెడ్‌రూం ఇళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అతిథిగృహంలో నీటిపారుదల శాఖ అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.
- మండలంలోని తూర్పుపల్లిలో నిర్వహించిన బొడ్రాయి వార్షికోత్సవానికి ఎమ్మెల్యే బాలునాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజలు చేస్తే గ్రామాలకు మేలు జరుగుతుందని, వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు పండుతాయని అన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు జాన్‌యాదవ్, బిక్కునాయక్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, నీటిపారుదలశాఖ అధికారులు, ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, యూనుస్, హరికృష్ణ, ఎర్ర ఆంజనేయులు, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, సీపీఐ నాయకులు పల్లా నర్సింహారెడ్డి, జూలూరి ధనలక్ష్మి బాలనారాయణగౌడ్ పాల్గొన్నారు.

'ఆదర్శ'లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

నిడమనూరు, జూన్ 12: నిడమనూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వివిధ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లోగిశెట్టి రంజిత తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు గణితం, ఇంగ్లీష్ బోధించటానికి ఎమ్మెస్సీ మ్యాథ్స్, బీఈడీ, ఎంఏ(ఇంగ్లీష్) బీఈడీ, 6 నుంచి 8 తరగతులకు ఇంగ్లీష్ బోధించటానికి ఎంఏ (ఇంగ్లీష్) బీఈడీ, టెట్, 6 నుంచి 10 తరగతి వరకు హిందీ బోధించుటకు రెండు పోస్టులకు గాను హెచ్‌పీటీ, టెట్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. అధ్యాపక పోస్టుల కోసం ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండ రూరల్, జూన్ 12: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీలకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ హోల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని టీజీ బీసీఎల్, ఎఫ్సీఐ, ఎలక్ట్రిసిటీ స్టోర్స్‌ల వద్ద బుధవారం హమాలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఎగుమతి, దిగుమతులు నిర్వహిస్తున్న హమాలీలకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పింఛన్ తదితర సౌకర్యాలతో హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థల్లో ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఐఎల్‌వో తీర్మానం ప్రకారం 40 కేజీల బస్తాలను అన్ని ప్రాంతాల్లో కచ్చితంగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన హమాలీలకు కనీస పెన్షన్ రూ.6000 నిర్ణయించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ హోల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, టీజీ బీసీఎల్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సల్లా యాదయ్య, కార్యదర్శి లొడంగి ఉపేందర్, ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పల్లె నగేష్, ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కత్తుల యాదయ్య, కార్యదర్శి శంకర్, యాదగిరిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

హిందువుల పై దాడి చేస్తే సహించేది లేదు



తీవ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ, జూన్ 12: హిందువులపై దాడి చేస్తే ప్రతిఘటన చర్యలు తప్పవని బజరంగ్‌దళ్ రాష్ట్ర కోకన్వీనర్ కన్నెబోయిన వెంకట్ హెచ్చరించారు. జమ్మూ కాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదులు దాడి చేసిన తీరును నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని రామగిరి సెంటర్లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో వైష్ణవి మాత దేవాలయానికి వెళ్తున్న హిందువులపై ఉగ్రవాదులు దాడి చేసి 10 మందిని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులతో ఉగ్రవాదులు హిందువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తమైతే దేశవ్యాప్తగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హె చ్చరించారు. ఉగ్రవాదులకు దేశంలో ఆశ్రయం కల్పిస్తున్న వారిపై మొదటగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దాడుల్లో నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ నాయకులు జూకూరి సంపత్ వర్మ, వంశీ, సాత్విక్ సత్యనారాయణ సంతోష్, మహేష్ విజయ్, నాని, పండు, శ్రీకాంత్, సందీప్, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు ప్రదానం

నల్లగొండ, జూన్ 12: గత ఏడాది దసరా పండుగ సందర్భంగా అక్టోబరు 18 నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు సంబంధించి లక్కీడ్రాలో గెలిచిన విజేతలకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. బస్సుల్లో ప్రయాణించిన ఐదుగురు పురుషులకు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ. 9,900 చొప్పున నగదు బహుమతులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్(ఓ) ఎస్.మాధవి, ఏవో వెంకటేష్, మోహినుద్దీన్, శ్యామలదేవి, జయప్రకాష్, రామోహన్‌రెడ్డి, హుస్సేన్, వెంకటేష్, నమశ్రీ, రాంమోహన్‌రెడ్డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే

అడవిదేవులపల్లి, పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి, జూన్ 12: మీ కుటుంబంలో ఎంతమంది ఉన్నారు..? మీ ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా..? మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. ఎన్ని రోజులకోసారి నీటిసరఫరా జరుగుతుంది. శుద్ధమైన నీరు అందుతుందా..? అంటూ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం జిల్లాలోని అడవిదేవులపల్లి, పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి మండలాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందుతుందా లేదా అనే అంశంపై అధికారులు సర్వే చేపట్టారు. నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా? కుటుంబం మొత్తానికి నీళ్లు సరిపోతున్నాయా అనే వివరాలు సర్వేలో సేకరిస్తున్నారు. ఏ గ్రామాలకు అందడం లేదు. ఏ సమయంలో నీరు వస్తుంది, ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా? అని ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. అంతేకాక ఇంటి ఫొటోతో పాటు, మిషన్ భగీరథ కింద ఏర్పాటు చేసిన నల్లా సంపును సైతం సర్వే సిబ్బంది ఫొటోలు తీస్తున్నారు. భగీరథ పథకానికి సంబంధించిన వివరాలతో పాటు కుటుంబంలో ఎంత మంది ఉన్నారు. మహిళలు, పురుషులు ఎంతమంది? కులం, ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్ వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సర్వే పది రోజులు జరుగుతోందని అధికారులు పేర్కొన్నారు.

- అడవిదేవులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు స ర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.కరుణాకర్‌రావు, ఎంపీవో మోసిన్‌బిన్‌అహ్మద్ పలు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. వారి వెంట సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.
- పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రామయ్య పాల్గొన్నారు.
- కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ నాగేష్, ఏఈ మాల్యాద్రి, గ్రామ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా జరగాలి



డీఈవోను కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు

నల్లగొండ, జూన్ 12: ఉపాధ్యాయుల ప దోన్నతులు, బదిలీలు స క్రమంగా జరిగేటట్లు చూడాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదావత్ లచ్చిరాంనాయక్ కోరారు. అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో భిక్షపతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా టీచర్ల పదోన్నతులు, బదిలీలను సక్రమంగా నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, రామకృష్ణ, ఉదావత్ లచ్చిరాంనాయక్‌నాయక్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం...

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో గల దుర్గాబాయ్ మహిళా శిశు వికాస కేంద్రంలో బ్యూటీ అండ్ హెల్త్‌కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా మేనేజర్ ఎ.అనిత ఒక ప్రకటనలో తెలిపారు.

త్రిపురారం: త్రిపురారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా విజయకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యప్రభ వ్యక్తిగత సెలవులపై వెళ్లినందున అనుముల మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తూ త్రిపురారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడతానని ఆమె తెలిపారు.

డిండి: ముస్లిం మైనార్టీ నూతన కమిటీని మండల కేంద్రంలోని షాదీఖానాలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఉమర్, ఉపాధ్యక్షులు షేక్ చాంద్‌పాష, ప్రధానకార్యదర్శి మహమ్మద్ ఖయూం, సహాయకార్యదర్శిగా మహ్మద్ నజీర్, కోశాధికారిగా ఇస్మాయిల్‌లను ఎన్నుకున్నారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీలోని 11వ వార్డులో తన సొంత ఖర్చులతో వీధి లైట్లను వార్డు కౌన్సిలర్, కౌన్సిలర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి ఏర్పాటు చేశారు.

మిర్యాలగూడ టౌన్: ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించగలరని సోషల్ వర్కర్ డాక్టర్ రాజు అన్నారు. స్వదేశీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడాశిబిరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నల్లగొండ: చిన్నారులు చదువు కుంటేనే భవిష్యత్తు ఉంటుందని శివలీల ఫౌండేషన్ చైర్మన్ కంబాల శివలీల అన్నారు. పట్టణంలోని లతీసా గుట్ట వద్ద భిక్షాటన చేస్తున్న ఓ బాలికను చూసి చలించిపోయారు. పీఆర్టీయూ నాయకుల సహకారంతో పాఠశాలలో బాలికను చేర్పించారు.

కొండమల్లేపల్లి: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రామ్మూర్తి సూచించారు. మండలకేంద్రంలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

చిట్యాలరూరల్: గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందడం లేదని, నీటి సరఫరా కోసం నిర్మించిన ట్యాంకుల ద్వారా పైప్‌లైన్లను ఏర్పాటు చేసి తాగునీటినందించాలని ఎంపీటీసీ ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు, చిట్యాల మండలం వెలిమినేడు-1 ఎంపీటీసీ దేశబోయిన స్వరూపనర్సింహ అధికారులను డిమాండ్ చేశారు.

కనగల్: మండలంలోని బుడుమర్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా బొడ్డుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కారింగ్ సతీష్, ప్రధానకార్యదర్శిగా కందుల జానయ్య, కోశాధికారిగా మల్లేష్ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని వెలిమినేడు పాల సంఘం ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అరూరి శ్రీశైలం డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది జూన్‌లో డైరెక్టర్లు, చైర్మన్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా కూడా అధికార పార్టీ నాయకులు జాప్యం చేస్తూ అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నారని ఆరోపించారు. వెలిమినేడు పాలసంఘం ఎన్నిలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని కోరారు. సమావేశంలో గడ్డం సూర్యప్రకాష్‌రెడ్డి, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాతి శ్రీనివాస్, రవి, రఘుమారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్: నిబంధనలు ఉల్లంఘించిన విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. డీఈవో భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సహచట్ట సలహా, రక్షణ సంఘం సభ్యుడు సరికొండ రుషికేశ్వరరాజు మాట్లాడుతూ పట్టణంలోని కృష్ణాకాలనీలోని ఓ కార్పొరేట్ పాఠశాల నిర్వాహకులు భారీగా పుస్తకాలు, నోట్ బుక్స్ నిల్వచేశారని ఆరోపించారు. ఆ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని ఎంఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయగా సంబంధిత ఉద్యోగులు పుస్తకాలు ఉన్న ఇంటికి సీజ్ చేశారని తెలిపారు. ఆ సీల్‌ను తొలగించడంపై ఎంఈవోను వివరణ కోరగా డీఈవో ఆదేశాల మేరకు తొలగించామని చెప్పినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు పాటించాల్సిన ఎంఈవో ప్రవర్తన తప్పుదోవ పట్టించే విధంగా ఉందని డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు రుషికేశ్వరరాజు తెలిపారు. ఆయన వెంట చిలుముల కొండలు, దేవులపల్లి కార్తీక్, ఉప్పుతల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ఈ వానాకాలం సీజన్ నుంచే కౌలు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు ఈ వానాకాలం నుంచే రైతు భరోసా అందజేస్తూ విత్తనాలు, ఎరువులను కూడా సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు.

దేవరకొండ: దేవరకొండకు చెందిన బీసీ ఉద్యమ నాయకుడు చొల్లేటి భాస్కరచారికి మహాత్మా జ్యోతిబాపూలే జాతీయ అవార్డును అందుకున్నారు. మహారాష్ట్రలోని పూణెలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన బహుజన రైటర్స్ 4వ సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అకాడమీ జాతీయ చైర్మన్ నల్లా రాధకృష్ణ అవార్డును అందజేశారు.

మిర్యాలగూడటౌన్: అధిక ఫీజులు నియంత్రించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీడయ్యయాదవ్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్టులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల అక్రమదందాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ, మాల మహానాడు, మైనార్టీ సంఘాల నాయకులు తాళ్లపల్లి సురేష్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.